# పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్

## గోవిందరాజు రామకృష్ణారావు

ఫిల్టర్ కాఫీ రుచి మాటల కందదు. ప్రొఫెసర్ చక్రపాణికి కాఫీ అంటే మహాయిష్టం. నిజానికి ఆ పూట కాఫీ మరింత రుచిగా కూడా వుంది. అయినా కాఫీ తాగిన అనుభూతి కలగలేదు. పేపరు పైకి మనసుపోవడంలేదు. నిన్నటిదాకా కాఫీ నోట్లో పోసుకోగానే పేపరు చదవకపోతే ఏమీ తోచేదికాదు. పేపరు కుర్రాడు ఏ కారణంచేతనైనా రావడం ఆలస్యమైతే గంగవెర్రు లెత్తడం ఖాయం. అలాంటిది ఎదురుగా పడివున్న పేపరుపైకే దృష్టిపోవడంలేదు. ఏదో పోగొట్టుకున్నవాడి మాదిరిగా చక్రపాణి వరండాలో పచార్లు చేస్తూ మాటిమాటికి పెదాలు తడుముకుంటున్నాడు. ఆదివారంనాడు చాల రిలాక్సింగ్ మూడ్‌లో వుండవలసింది. ఆ ఛాయలే లేవు. గదిలోకి వెళ్ళి వక్కపొడి వేసుకొచ్చాడు. పేపరు తీసుకుని ఈజీచైర్లో చార్లాపడ్డాడు. అప్రయత్నంగా జేబు తడుముకున్నాడు. సిగరెట్ పెట్టిలేదు. దాన్ని రాత్రి తానే కసితో నలిపి అవతలపారేశాడు. జన్మలో యిక సిగరెట్ ముట్టుకోనని పార్వతికి మాటిచ్చాడు. అంతేకాదు..తమకు ప్రాణంకంటే ఎక్కువైన రాఘవ పైన ఒట్టేసి మరీ వాగ్దానం చేశాడు. రాఘవ ఒక్కగా నొక్క కొడుకు. ఆశలన్నీ అతనిమీదే లగ్న మయ్యాయి. తమ కలలపంట. అతని భవిష్యత్తుకు బంగారుబాట వేయడమే తమ జీవితధ్యేయం. అందుకు ఎంతటి త్యాగానికైనా సిద్ధమే. సాధ్యాసాధ్యాల ప్రసక్తి వుండదు. ప్రమాణం తప్పడానికి మనసు ససేమిరా సమ్మతించడంలేదు.

ఇప్పుడెలా? ఉదయం కాగానే ఆలోచలన్నింటిని అదుపుచేసేవి – కాఫీ, సిగరెట్, పేపరు. వీటిలో ఏది లోపించినా తలలో ఏదో పురుగు తొలుస్తున్నట్టుగా వుంటుంది.

కళ్ళు పేపరు వంక చూస్తున్నా వార్తలేమీ అర్థంకావడం లేదు. పేజీలు మాత్రం యాంత్రికంగా తిరగేస్తున్నాడు. క్రితం రాత్రి జరిగిన సంఘటన కళ్ళకు కట్టినట్లయింది.

డైనింగ్ టేబిల్‌మీద రెండు పేట్లలో ఇడ్లీ పెట్టివున్నాయి. చిన్న గిన్నెలో తన కిష్టమైన మామిడి అల్లం పచ్చడి నోరూరిస్తోంది. పక్కనే చిన్న పేట్లో కారప్పొడి పైన వేసిన వెన్నకాచిన నెయ్యి ఘుమఘుమలాడుతోంది. రాఘవ అన్నం తిని ప్రయివేటు చెప్పించుకునేందుకు వెళ్ళాడు. మరో గంటకి గాని రాడు. పార్వతి, చక్రపాణి శనివారం నాడు రాత్రిపూట భోజనం చేయరు.

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. ప్లేట్లలో ఇడ్లీలు నిమ్మదిగా తరుగుతున్నాయి. పార్వతి ముభావంగా వుండడం చక్రపాణి గమనించాడు. "ఏమిటోయ్! ఇంత బ్రహ్మాండంగా టిఫిన్ తయారు చేసి అలా మాట్లాడకుండా కూర్చున్నావ్!' భార్యని కబుర్లలోకి దింపాడు.

నిజానికి టిఫిన్ అవగానే ఒక ముఖ్యవిషయం భర్తతో చెప్పాలనుకుంటోంది. అసలు ఎంతో కాలంగా తనలో తాను మధనపడుతోంది. సిగరెట్ల వల్ల ముంచుకొచ్చే ప్రమాదం గురించి ప్రతిరోజూ పేపర్లు మోసుకొస్తున్న సంగతులు చదివి తల్లడిల్లిపోతోంది. ఎలాగైనా భర్తచేత ఈ పాడు అలవాటు మాన్పించాలని గట్టిగా నిర్ణయించుకుంది. రాఘవ లేనప్పుడు ఈ చర్చ జరపాలని కూడా అనుకుంది. ఎలా ప్రారంభించాలో తెలియక ఆలోచనతో సతమతమవుతూ మౌనంగా వుండిపోయింది. భర్తే కబుర్లలోకి దింపడంతో ధైర్యం కూడగట్టుకుంది.

"ఇడ్లీ బావుంటే మరో రెండు వేస్తా" అని కొసరి కొసరి వడ్డించింది.

ఫలహారం అయ్యాక చక్రపాణి సిగరెట్‌పెట్టిలోంచి హుషారుగా సిగరెట్ తీసి పెట్టిమీద సుతారంగా కొడుతూ 'అగ్గిపెట్టి యిలా యివ్వవోయ్' భార్యని అడిగాడు దీర్ఘాలు తీస్తూ.

తన కోరిక ఫలించేందుకు యిదే మంచి అదననుకుంది పార్వతి.

అగ్గిపెట్టి పట్టుకెళ్ళకుండా దగ్గరికెళ్ళి ఒయ్యారంగా భర్త చేతిలోంచి సిగరెట్ లాక్కుంటూ 'మీ రీ అలవాటు వెంటనే మానేయాలండీ!' బుంగ మూతిపెట్టి నిక్కచ్చిగా చెప్పింది.

సిగరెట్ అందుకోబోతూ 'అదేమిటి. దేవి గారికి అంత సడన్‌గా జ్ఞానోదయమయిందే! ఏం కథ?' వెటకారంగా చూశాడు.

పార్వతి చేతులు వెనక్కి పెట్టుకుని గొంతులో గాంభీర్యం నింపుకుని 'నే నెప్పట్నుంచో పోరుతూనే వున్నాను. మీరే నన్ను పురుగును దులిపినట్లు దులుపుతున్నారు యింతకాలం. ఇకనైనా దీని జోలికిపోకండి' అంది.

'ఏం కొంపమునిగిందిపుడు' చిరాకు పడ్డాడు.

పార్వతి ఈ అవకాశాన్ని జారవిడుచుకోదలచ లేదు.

'నే నో ప్రశ్నడుగుతాను. సూటిగా సమాధానం చెబుతారా?' గట్టిగా అడిగింది.

'నసపెట్టక అదేమిటో అడుగు' గొంతు పెంచాడు.


'మీరు ఎప్పటినుంచి సిగరెట్లు తాగడం మొదలు పెట్టారు? కాలేజీలో చేరాకా? స్కూల్లో వుండగా నేనా? అయితే ఎన్నో క్లాసు నుంచి?' ప్రశ్నలు వాడి బాణాల్లా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి.

చక్రపాణి నిశ్చేష్టుడయ్యాడు. ఊహించని ప్రశ్నలు. పైగా పార్వతి కంఠంలో కరకుతనం. బోన్లో నిలబడ్డవాడిలా 'పదో తరగతి నుంచి' జవాబిచ్చాడు.

పార్వతి ఆ సమాధానం విని వుగ్రమూర్తిలా మారింది. 'అయితే మీ కొడుకు మిమ్మల్ని

గణాధిపతి

(చిత్రం : బి. వెంకటేశ్వరరావు)








మించిపోయాడు. తొమ్మిదో తరగతిలోనే మొదలు పెట్టాడు' ఈ సడింపుగా అంది గళంలో మార్దవం మచ్చుకైనా లేకుండా.

చక్రపాణికి నెత్తి మీద వందపిడుగులు ఆగకుండా పడినట్లయింది. తన నెవరో పాతాళానికి విసిరివేసి నట్లయింది. నోట మాట రాలేదు. శక్తి నంతా కూడగట్టుకుని తెప్పరిల్లాడు.

'నువ్వంటున్న దేవిటి పార్వతీ' గొంతు వణికింది.

చక్రపాణిని చేయిపట్టుకుని గబగబా రాఘవ గదిలోకి తీసుకెళ్ళింది. హ్యాంగర్ కున్న చొక్కా తీసి జేబు దగ్గర వాసన చూపించింది. జామెట్రీ బాక్సు తెచ్చి మూతతీసి అందులోంచి సిగరెట్ పైకిలాగి చేతితో నలిపి కిందపడేసి కసితో కాళ్ళతో తొక్కింది. భర్త గుండెపై తలవాల్చి ఏడ్చింది. సైకాలజీ ప్రొఫెసర్ మీరు. ఆ మాత్రం గ్రహించలేకపోయారు. ఏ ముఖం పెట్టుకుని వాళ్ళ మందలించగలరు? మీ కా ధైర్యం లేదు. ఎదురుతిరిగి మిమ్మల్ని నిలదీస్తే మీ రేం జవాబిస్తారు?' బాకుతో పొడిచినట్టున్నాయి ఆమె మాటలు.

చక్రపాణి యింకేమీ వాదించే స్థితిలో లేదు. రాఘవని నిలదీసే సాహసంలేదు.

'పారూ! ఊరుకో. రాఘవమీద ఒట్టేసి చెబుతున్నా..... నేను ఈ జన్మలో మళ్ళీ సిగరెట్ తాగను. నువ్వే వాడికి నచ్చచెప్పి వాడి చేత సిగరెట్టు మాన్పించు. ఆ మాట తలుచుకుంటేనే నా గుండె బద్దలవుతోంది' ప్రాధేయపడుతూ అన్నాడు.

రాఘవ ప్రయివేటు నుంచి వస్తున్నట్టు అలికిడి విని గదిలోంచి యిద్దరూ హాల్లోకి వచ్చారు సంబాళించుకుని.

అదీ రాత్రి సంఘటన. అవును ఎంత కష్టమైనా ఓర్చుకోవాలి! రాఘవ చెడిపోకూడదు. తండ్రిగా ఆ మాత్రం త్యాగానికి సిద్ధపడాలి. చక్రపాణి మనసు సమాధానపరచుకుంటోంది. తాను చేస్తున్న ఈ త్యాగాన్ని చూసి రాఘవ సన్మార్గంలో పడితే అంతకన్నా కావలసిందేముంటుందని చక్రపాణి మనసు పదేపదే చెబుతోంది. ఈ తర్జన భర్జనలో పేపరు పేజీలు పూర్తయ్యాయి.

చక్రపాణి అవస్థ గమనించి లోపల హాల్లో తల్లీ కొడుకులు నవ్వుకోవడం అతనికి తెలియదు.

'అమ్మా! మొత్తంమీద నాన్నని దార్లోకి తెచ్చావ్ ఒక్క రోజులో! నాటకం భలే రక్తికట్టింది. నాన్న ఆటకట్టు. కాని నా పైన నాన్నకి అనవసరంగా అపోహకల్పించావ్!' అని రాఘవ తల్లితో అన్న మాటలు చక్రపాణికి వినిపించలేదు.

'ఆయన దార్లో పడ్డాక అంతా చెబుతాలేరా!' అని హామీ యిచ్చింది. □